# ప్రాణప్రతిష్ఠకు విపక్షం దూరం

## కార్యక్రమానికి ప్రధాన ప్రతిపక్ష నేతల గైర్హాజరు

## తర్వాత కుటుంబసభ్యులతో వెళ్తామని ప్రకటనలు

న్యూఢిల్లీ, జనవరి 22: అయోధ్యలో అంగ రంగ వైభవంగా జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి వేలాది మంది ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో రాజకీయ నాయకుల నుంచి సినీ స్టార్లు, క్రీడాకారులు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు, సాధువులు ఇతర ప్రముఖులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి ఆలయ ట్రస్టు కాంగ్రెస్ సహా పలువురు విపక్ష నేతలను ఆహ్వానించింది. అయితే చాలా మంది విపక్ష నేతలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు.

### కోల్‌కతాలో మమత ర్యాలీ

పశ్చిమబెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమత బెనర్జీ కోల్‌కతాలో 'మత సామరస్య' ర్యాలీ చేపట్టారు. కాలిఘాట్ ఆలయంలో పూజల తర్వాత ఆమె ర్యాలీ చేపట్టారు. అయోధ్య కార్యక్రమం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే.. మమత ఉద్దేశపూర్వకంగా ఈ ర్యాలీ చేపట్టారని బీజేపీ ఆరోపించింది.

### ఢిల్లీలో ఆప్ శోభాయాత్రలు

అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, మంత్రులు, ఆప్ ఎమ్మెల్యేలు ఢిల్లీవ్యాప్తంగా జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అన్నదానాలు, శోభాయాత్రలు నిర్వహించారు. భారత సమాజానికి రాముడు గొప్ప ప్రతీక అని, తనకు ఆహ్వానం అందిందని, అయితే అయోధ్యకు కుటుంబంతో తర్వాత వెళ్తానని కేజ్రీవాల్ అంతకుముందు పేర్కొన్నారు.



టీఎంసీ అధినేత్రి మమత బెనర్జీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో 'మత సామరస్య' ర్యాలీ

### తమిళనాడులో డీఎంకే X బీజేపీ

మసీదును కూల్చి ఆలయాన్ని నిర్మించడాన్ని తాము ఆమోదించడం లేదని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ఇప్పటికే స్పష్టం చేశారు. మరోవైపు అయోధ్య కార్యక్రమం లైవ్ ప్రసారాలను రాష్ట్ర సర్కార్ అడ్డుకొంటున్నదని బీజేపీ ఆరోపించగా.. అధికార డీఎంకే ఆరోపణలను ఖండించింది.

### దూరంగా ఇతర ప్రముఖ విపక్ష నేతలు

ప్రాణప్రతిష్ఠ ఆహ్వానానికి ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపిన ఎన్సీపీ అధినేత శరద్ పవార్.. రద్దీ దృష్ట్యా తాను తర్వాత అయోధ్యకు వెళ్తానని పేర్కొన్నారు. 1990లో అద్వానీ రథయాత్రను బీహార్ అడ్డుకొన్న అప్పటి సీఎం ఆర్జేడీ అగ్రనేత లాలూ ప్రసాద్ కూడా కార్యక్రమానికి వెళ్లలేదు. ఇందుకు ఆయన కారణం వెల్లడించలేదు. ఇక తమ కుటుంబంతో ప్రాణప్రతిష్ఠ తర్వాత అయోధ్యకు వెళ్తామని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ వెల్లడించారు. బీజేపీ మతాన్ని, రాజకీయాలను కలబోస్తున్నదని ఆరోపిస్తూ సీపీఎం ప్రాణప్రతిష్ఠకు దూరంగా ఉన్నది.

### ఆలయంలోకి రాహుల్‌కి అనుమతి నిరాకరణ!

భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అస్సాంలో ఉన్నారు. నాగావ్‌న్‌లో ఉన్న బటద్రవ సత్ర గుడిలోకి తనను అధికారులు రానివ్వడం లేదని ఆరోపిస్తూ ధర్నా చేశారు. ప్రాణప్రతిష్ఠ ఆహ్వానితులైన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియా కూడా ఈ యాత్రలో పాల్గొంటున్నారు. అయోధ్య కార్యక్రమాన్ని బీజేపీ 'పొలిటికల్ ఈవెంట్'గా మార్చిందని, అందుకే హాజరుకావడం లేదని కాంగ్రెస్ పేర్కొన్నది.

## రావణుడి ఆలయంలోకి శ్రీరాముడు

- **నోయిడాలోని బిశ్రాక్ ఆలయంలోకి తొలిసారి ప్రవేశం**

నోయిడా, జనవరి 22: రావణుడి ఆలయంలోకి శ్రీరాముడు ప్రవేశించడటమేంటని అనుకుంటున్నారా? యూపీలో నోయిడాలోని బిశ్రాక్ గ్రామంలో రావణుడ్ని పూజించే ఆలయముంది. అత్యంత పురాతమైన శివాలయంలో రావణుడిని ఇక్కడివారు దేవుడిగా భావిస్తూ విగ్రహాన్ని పూజిస్తారు. తమ గ్రామంలోనే రావణుడు జన్మించాడని స్థానికులు బలంగా విశ్వసిస్తారు. అయితే.. అయోధ్య రామాలయ వేడుక నేపథ్యంలో మొట్టమొదటిసారిగా ఈ ఆలయం ఆవరణలోకి లక్ష్మణ సమేత సీతారాముల విగ్రహాల్ని తీసుకొచ్చారు.

## కోటి ఇళ్లకు సోలార్ ప్యానెల్స్: మోదీ

న్యూఢిల్లీ: అయోధ్యలో రామాలయ ప్రారంభం తర్వాత ప్రధాని మోదీ ఓ కొత్త పథకాన్ని ప్రకటించారు. అయోధ్య నుంచి ఢిల్లీ వెళ్లిన వెంటనే 'ప్రధాన మంత్రి సూర్యోదయ యోజన'ను ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. కోటి ఇళ్లపైన రూఫ్‌టాప్ సోలార్‌ను అమర్చాలనేది లక్ష్యమని చెప్పారు. అయోధ్య నుంచి ఢిల్లీకి వచ్చిన వెంటనే తీసుకున్న తొలి నిర్ణయం ఇదేనని చెప్పారు. ఈ నిర్ణయం వల్ల పేద, మధ్య తరగతి ప్రజల కరెంటు బిల్లుల ఖర్చు తగ్గడమే కాకుండా, భారత దేశం ఇంధన రంగంలో స్వయం సమృద్ధం అవుతుందన్నారు.

## తక్షణమే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి

- **సుప్రీంకోర్టులో పిటిషన్**

న్యూఢిల్లీ: ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలంటూ కాంగ్రెస్ నేత జయ ఠాకూర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారణకు చేపట్టిన ధర్మాసనం రెండు వారాల్లోగా స్పందనను తెలియజేయాలంటూ కేంద్రాన్ని కోరింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా జయ ఠాకూర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ చట్టం తక్షణమే అమలైతే త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయని చెప్పారు.

# శ్రీరాముని ఆభరణాలు అదరహో

అయోధ్య: బాల రాముడు ధరించిన ఆభరణాల్లో ఒక్కొక్కదానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉంది. ఐదేళ్ల ప్రాయంలో ఉన్న బాలుడు కాబట్టి ఆడుకోవడం కోసం బొమ్మలను కూడా అందుబాటులో ఉంచారు. ఏనుగు, గుర్రం, ఒంటె, బండి వంటివాటిని పెట్టారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ వివరాలను వెల్లడించింది.

**కిరీటం:** బాల రాముడు ధరించిన బంగారు కిరీటంలో సూర్య దేవుని బొమ్మ ఉంది. ఈ కిరీటంలో వజ్రాలు, పచ్చ రాళ్లు, మరకత, మాణిక్యాలను పొదిగారు. దీనిని ఉత్తర భారత దేశ సంప్రదాయంలో తయారు చేశారు. కిరీటం కుడివైపున ముత్యాల దండలను వేలాడదీశారు.

**కౌస్తుభ మణి:** బాల రాముని హృదయ భాగంలో ఉంచిన కౌస్తుభ మణిని కెంపులు, వజ్రాలతో అలంకరించారు. విష్ణుమూర్తి అవతారాలన్నిటిలోనూ ఇది కనిపిస్తుంది.



**విజయమాల:** బాల రాముడు ధరించిన ఆభరణాల్లో ఇది చాలా పొడవైనది. కెంపులు పొదిగిన ఈ హారం విజయానికి చిహ్నంగా నిలుస్తుంది. వైష్ణవ సంప్రదాయ చిహ్నాలైన సుదర్శన చక్రం, కమలం, శంఖం, మంగళ కలశం దీనిలో ఉన్నాయి.

**కంఠాభరణం:** అర్ధ చంద్రాకారంలో ఉన్న మరొక హారంలో అదృష్టాన్ని సూచించే పూల డిజైన్లు ఉన్నాయి. మధ్య భాగంలో సూర్య దేవుని బొమ్మ ఉంది. ఈ హారాన్ని కంఠాభరణం అంటారు. నడుముకు అమర్చిన ఆభరణంలో వజ్రాలు, మరకత, మాణిక్యాలు, కెంపులను పొదిగారు. వజ్రాలు, పచ్చరాళ్లు, ముత్యాలను పొదిగిన పాదిక అనే హారాన్ని నాభి వద్ద అలంకరించారు. అదేవిధంగా భుజకీర్తులు, మండ గొలుసులు, ఉంగరాలను కూడా బాల రామునికి ధరింపజేశారు. బాల రాముని కాళ్లకు కడియాలు, కాలి వేళ్లకు చుట్లు పెట్టారు. వీటన్నిటిలోనూ వజ్రాలు, కెంపులను పొదిగారు. ముత్యాలు, పచ్చ రాళ్లు పొదిగిన బంగారు విల్లు, ఓ బాణం కూడా బాల రాముని చేతుల్లో ఉన్నాయి. వజ్రాలు, కెంపులతో వెండి-ఎరుపు రంగుల్లో నుదుటిపై తిలకాన్ని పెట్టారు. వాల్మీకి రామాయణం, ఆధ్యాత్మ రామాయణం, రామచరితమానస్ వంటి గ్రంథాలను విస్తృతంగా అధ్యయనం చేసి ఈ ఆభరణాలను తయారు చేయించినట్లు ట్రస్ట్ వెల్లడించింది.

పసుపు రంగు పంచె, ఎరుపు రంగు అంగవస్త్రాలను బెనారస్ వస్త్రాలతో తయారు చేయించారు. వీటిపైన శంఖం, పద్మం, చక్రం, నెమలి బొమ్మలు ఉన్నాయి. ఆకర్షణీయమైన జరీ అంచులు ఉన్నాయి.


## రాములోరికి 101 కిలోల బంగారం విరాళం

న్యూఢిల్లీ: అయోధ్య రామమందిర నిర్మాణానికి దేశ, విదేశాల నుంచి భక్తులు విరాళాలు ఇచ్చారు. రోజువారీ కూలీల దగ్గర్నుంచి పెద్ద వ్యాపారుల వరకు తోచినంత అయోధ్య రాముడికి భక్తితో సమర్పించుకున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టిన విరాళాల సేకరణలో 20 లక్షల మంది కార్యకర్తలు 12.7 కోట్ల కుటుంబాల నుంచి రూ.2100 కోట్లు సేకరించారని వీహెచ్‌పీ లెక్కలు చెబుతున్నాయి. భూరి విరాళం అందించిన వారిలో దిలీప్ కుమార్ వి లాఖీ, ఆయన కుటుంబం ముందు వరుసలో ఉంటుంది. సూరత్‌కు చెందిన ఈ వజ్రాల వ్యాపారి రాములోరికి 101 కేజీల బంగారాన్ని కానుకగా ఇచ్చినట్టు తెలుస్తున్నది. దీని ప్రస్తుత మార్కెట్ విలువ రూ.68 కోట్లుగా ఉంది. ఈ బంగారాన్ని రామాలయ తలుపులు, గర్భగుడి, త్రిశూలం, డమరు, పిల్లర్లకు కేటాయించారు. విరాళాల్లో ఇప్పటివరకు ఇదే అత్యధిక మొత్తం అని తెలుస్తున్నది.

# నిమిషానికి 1.4 లక్షల కోళ్లు పాతం

*ప్రపంచవ్యాప్తంగా మనుషులు ఏటా 36 కోట్ల టన్నుల జంతువుల మాంసాన్ని ఆహారంగా తీసుకొంటున్నారు. చేపలు వంటి సముద్ర జీవులను కూడా ఇందులో కలిపితే మాంసం మోతాదు 100 కోట్ల టన్నులు దాటుతుంది. చేపలు మినహా మనుషులు ఎక్కువగా తీసుకొంటున్న మాంసాహార జాబితాలో చికెన్ ముందు వరుసలో ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా నిమిషానికి 1.4 లక్షల కోళ్లను తింటున్నట్టు అవర్ వరల్డ్ ఇన్ డాటా తాజా నివేదిక వెల్లడించింది. మాంసం ఎక్కువగా తీసుకొంటున్న దేశాల జాబితాలో చైనా అగ్రస్థానంలో ఉన్నది.*

**- స్పెషల్ టాస్క్ బ్యూరో, నమస్తే తెలంగాణ**




# గుండెపోటుతో ఐదేండ్ల బాలిక మృతి!

### యూపీలో ఘటన

అమ్రోహా, జనవరి 22: ఫోన్‌లో కార్టూన్లు చూస్తున్న ఐదేండ్ల బాలిక హఠాత్తుగా గుండె పోటుతో మరణించింది! ఈ షాకింగ్ ఘటన యూపీలోని అమ్రోహా జిల్లా హతాయిఖేడాలో ఆదివారం జరిగింది. కామిని తన తల్లి పక్కన పడుకొని ఫోన్ చూస్తుండగా హఠాత్తుగా అచేతనంగా మారిపోయింది. వెంటనే బాలికను ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు ధ్రువీకరించారు. గుండెపోటు వల్ల బాలిక చనిపోయి ఉండొచ్చని చెప్పారు. అయితే శవ పరీక్షకు బాలిక కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో మరణానికి గల కచ్చితమైన కారణం తెలియలేదు. అమ్రోహా, బిజ్నర్ జిల్లాల్లో ఇటీవల డజనుకు పైగా పిల్లలు, ఒక యువకుడు గుండెపోటుతో చనిపోయారు. 'చలి వాతావరణం గుండె పోటుకు కారణం కావొచ్చు. ఈ వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలు, రక్తపోటు సాధారణంగా పడిపోయి రక్తం గడ్డ కట్టే అవకాశాన్ని పెంచుతాయి' అని సీనియర్ ఫిజిషియన్ రాహుల్ బిష్ణోయ్ తెలిపారు.

## మరాఠ్వాడాలో రైతుల మృత్యుఘోష

**గత ఏడాది 1,088 మంది బలవన్మరణం**

ఛత్రపతి శంభాజీనగర్, జనవరి 22: సేద్యం గిట్టుబాటు కాకపోవడంతో మహారాష్ట్రలో బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతుల సంఖ్య ఏటికేడు పెరుగుతున్నది. గత ఏడాది మహారాష్ట్రలోని మరాఠ్వాడాలో 1,088 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని డివిజినల్ కమిషనర్ నివేదిక పేర్కొంది. 2022తో పోలిస్తే ఈ సంఖ్య 65 పెరిగిందని ఓ అధికారి తెలిపారు. బీడ్ జిల్లాలో అత్యధికంగా 269 మంది ఆత్మహత్య చేసుకోగా, ఛత్రపతి శంభాజీనగర్‌లో 182, నాందేడ్‌లో 175, ధారాశివ్‌లో 171 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.

## వాట్సాప్‌లో 'నియర్‌బై షేరింగ్'

**త్వరలో అందుబాటులోకి కొత్త ఫీచర్**

న్యూఢిల్లీ: వాట్సాప్ త్వరలో 'నియర్‌బై షేరింగ్' అనే కొత్త ఫీచర్ అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ ఫీచర్ సాయంతో కేబుల్స్, ఇంటర్నెట్ అవసరం లేకుండానే పక్కనున్న వారికి ఫైల్స్ ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. పరీక్షల దశలో ఉన్న ఈ ఫీచర్ వాట్సాప్ బీటా యూజర్లకు అందుబాటులో ఉన్నట్టు వాట్సాప్ కమ్యూనిటీ బ్లాగ్ 'వాబీటా ఇన్ఫో' వెల్లడించింది. ఫోన్‌లో వాట్సాప్ యాప్‌ను ఓపెన్ చేసి డివైజ్‌ను కదిపితే (షేక్ చేస్తే) పక్కన ఉన్నవారికి షేర్ రిక్వెస్ట్ వెళ్తుందని, వారు దాన్ని ఆమోదిస్తే ఫైల్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ మొదలవుతుందని తెలిపింది.